





డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు దంపతులను సత్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యేలు పుల్లారావు, యార్లగడ్డ, మన్నవ మోహనకృష్ణ, తులసీ రామచంద్రప్రభు

కష్టపడే వారికే గుర్తింపు

- నామినేటెడ్ పదవుల్లో సిఫార్సులుండవ్
- జగన్‌లాంటి వ్యక్తులను రాకుండా చూసుకోవాలి
- 'తల్లికి వందనం' పథకంతో వైసీపీకి మరణ శాసనం
- క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ఒక్కొక్కటిగా హామీల అమలు
- డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం సత్కార సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో ఎవరి సిఫార్సులుండవని, కష్టించి పనిచేసిన కార్యకర్తలకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు తప్పక గుర్తింపు ఇస్తారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడి అభినందన సభ స్థానిక ఏ కన్వెన్షన్ హాల్లో శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా ఇచ్చిన హామీల కోసం సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అమలు చేసిన 'తల్లికి వందనం' పథకం వైసీపీకి మరణ శాసనం లాంటిదన్నారు. సంక్షేమం, అభివృద్ధి అజెండాగా అహర్నిశలు కృషి చేస్తున్న చంద్రబాబు నాయకత్వం కావాలని, జగన్‌లాంటి విధ్వంసకారుడు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ పార్టీలో కష్టించి పనిచేసిన వారందరికీ పదవులు వస్తాయని, ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు.

డీసీసీబీల్లో దోపిడీ: గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ

వైసీపీ హయాంలో జిల్లా సహకార సెంట్రల్ బ్యాంకుల్లో ఆ పార్టీ నాయకులు పందికొక్కుల్లా దోచుకుతిన్నారని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు ఆరోపించారు. డీసీసీబీల్లో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని, అవినీతిపరులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అనంతరం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు ఏపీ ఐటీ సంస్థ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, తులసీ గ్రూపు సంస్థల చైర్మన్ తులసీ రామచంద్రప్రభు, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కూటమి నేతలు పాటిబండ్ల నాగేశ్వరరావు, తాడిశెట్టి మురళీమోహన్, తాళ్ల వెంకటేష్‌యాదవ్, గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, కన్నా రవిదేవరాజ్, కార్పొరేటర్లు హరిబాబును ఘనంగా సత్కరించారు.

రక్త నిల్వలను పెంచేందుకు కృషి

- రెడ్ క్రాస్‌ను వైసీపీ కలుషితం చేసిందంటూ వ్యాఖ్యలు
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

గుంటూరు(తూర్పు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రక్త నిల్వలను గణనీయంగా పెంచేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం పురస్కరించుకుని శనివారం గుంటూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంస్థలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి 5 లక్షల 33 వేల యూనిట్లు అవసరమని, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలకు చెందిన బ్లడ్ బ్యాంకుల్లో దాదాపు 7 లక్షల యూనిట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. దానిని 10 లక్షలకు పెంచేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు చెప్పారు. రోజురోజుకి పెరుగుతున్న రక్తహీనత, క్యాన్సర్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ఈ నిల్వలను మరింతగా పెంచాలన్నారు. రక్త సేకరణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమన్నారు. ప్రతి ఏడాది అవసరమైన 5 లక్షల యూనిట్లలో 20 శాతం రెడ్ క్రాస్ ద్వారానే అందుతుందని చెప్పారు. అటువంటి రెడ్ క్రాస్‌ని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా కలుషితం చేసిందన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధాన్యం.. ధనమేది?

- రైతులకు రూ.25.33 కోట్లు బకాయి
- పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అన్నదాతల ఆందోళన
- 24 గంటల్లో చెల్లింపులని.. నెల దాటినా అందని వైనం
- ఖరీఫ్ సాగుకు డబ్బు అందుతుందా లేదా అన్న ఆందోళన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ముప్పాళ్ల మండలానికి చెందిన రైతు చలపతిరావు రైతు సేవా కేంద్రం ద్వారా 94.4 క్వింటాళ్ల ధాన్యం గత నెల 10న విక్రయించారు. ఇదే మండలానికి చెందిన కోటేశ్వరరావు 44 క్వింటాళ్లు, వెంకటేశ్వర్లు 6.4 క్వింటాళ్ల ధాన్యం 36 రోజుల క్రితం ధాన్యం విక్రయించారు. అయితే వీరి ముగ్గురి ఖాతాల్లో నేటికి ఒక్క రూపాయి కూడా నగదు జమ కాలేదు. వీరు ముగ్గురే కాదు పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఇలాంటి వారు వందల సంఖ్యలోనే ఉన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లో నగదు చెల్లిస్తున్నామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్తున్నారు. అయితే ఆ మాటలు అమలుకు నోచుకోవడం లేదు. ధాన్యం విక్రయించి నెల దాటినా, నేటికీ చేతికి ధనం అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగు ప్రారంభమైంది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడికి నగదు అందివ్వాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం విక్రయించినా నగదు చేతికి అందకపోవడంతో అప్పులకు వడ్డీ పెరిగిపోతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధాన్యం నిల్వలు

అన్నదాతల అయోమయం..

ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నగదు చెల్లింపులో జాప్యం జరిగితే న్యాయం కోసం రైతులు ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తారు. అయితే ప్రభుత్వమే కొనుగోలు చేసి, చెల్లింపుల్లో జాప్యం చేస్తుండటంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో రైతులున్నారు. మద్దతు ధర లభిస్తుందనే ఆశతో వందలాది మంది రైతులు రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించారు. పల్నాడు జిల్లాలో 359 మంది రైతులకు రూ.6.33 కోట్లు, బాపట్ల జిల్లాలో 1200 మంది రైతులకు సుమారు రూ.19 కోట్లు చెల్లించాలి. ధాన్యం డబ్బు ఎప్పుడు వస్తుందో తెలుసుకునేందుకు రైతులు రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లపై పౌరసరఫరాల శాఖ డీఎం నారదమణిని వివరణ కోరగా ఎఫ్‌సీఐ నుంచి నిధులు విడుదలలో జాప్యం జరిగిందని, త్వరలోనే రైతుల ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు.

లక్ష్యం.. సాధించారు

- నీట్‌లో మెరిసిన గుంటూరు విద్యార్థులు
- పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామంటున్న ర్యాంకర్లు

గుంటూరు(విద్య), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కావడమే లక్ష్యంగా భావించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం.. అధ్యాపకుల సహకారంతో నీట్‌లో మెరిశారు. లక్ష్యం కోసం అకుంఠిత దీక్షతో కృషి చేసి లక్షల మంది పోటీ పడిన నీట్ పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించారు. మే 4న నీట్ పరీక్ష జరగ్గా అందుకు సంబంధించిన ఫలితాలను ఎన్‌టీఏ శనివారం విడుదల చేసింది. ఈ పరీక్షలో గుంటూరుకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ విభాగాల్లో ర్యాంకులు సాధించిన కొంతమంది విద్యార్థులు తమ లక్ష్యాలను ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పేదలకు డాక్టర్‌గా సేవ చేస్తా



వైద్య విద్య పూర్తి చేసి పేదలకు సేవ చేస్తాను. ఢిల్లీ ఎయిమ్స్‌లో సీటు సాధించి వైద్య విద్య పూర్తి చేస్తాను. అనంతరం న్యూరాలజీలో స్పెషలైజేషన్ చేయాలనేది లక్ష్యం. గుంటూరులోని భారత్‌పేటలో ఉంటాం. తల్లి విజయ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణిత అధ్యాపకురాలు. తండ్రి భానుప్రకాశ్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు.

- విక్రాంత్, 9వ ర్యాంకు(ఎస్సీ విభాగం)

రైతు కుమార్తె డాక్టర్



గుంటూరులోని దేవాపురంలో ఉంటాం. తండ్రి కృష్ణారెడ్డి రైతు. తల్లి సునీత గృహిణి. చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు డాక్టర్ కావాలని తనను ప్రోత్సహించారు. ర్యాంకు సాధనలో అధ్యాపకుల శిక్షణ ఎంతో ఉపయోగపడింది. పేదలకు సేవలు అందిస్తాను.

- నాగిరెడ్డి మనస్విని, 49వ ర్యాంకు(ఈడబ్ల్యూఎస్)

జిప్మర్‌లో సీటే లక్ష్యం



జిప్మర్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేయడమే లక్ష్యం. నీట్ పరీక్ష కోసం తల్లిదండ్రులు రెబా విద్య, రత్నాకర్ చేసిన కృషి మరువలేను. విదేశాల్లో ఉండే తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేసి తమ చదువు కోసం గుంటూరు వచ్చారు. వైద్య విద్య తర్వాత పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాను.

- ఎస్పీ జడ్సన్, 108వ ర్యాంకు (ఎస్సీ విభాగం)

ఢిల్లీ ఎయిమ్స్‌లో చదవాలి



జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్య విద్య పూర్తి చేస్తాను. ప్రకాశం జిల్లా యర్ర గొండపాలెం మాది. అయితే గుంటూరులో విద్యను అభ్యసించా. తల్లి తిరుపతీబాయ్ గృహిణి. తండ్రి ఏసానాయక్ గ్రామంలోనే ఉపాధ్యాయుడిగా పని చేస్తారు. ఎంబీబీఎస్ తర్వాత న్యూరో సర్జన్‌గా గ్రామీణ పేదలకు వైద్యం అందిస్తాను.

- ఆర్ తరుణ్‌కుమార్, 51వ ర్యాంకు (ఎస్టీ విభాగం)

చినతురకపాలెం విద్యార్థిని ప్రతిభ



నరసరావుపేట టౌన్ : నీట్ ఫలితాలలో నరసరావు పేట మండలం చినతురకపాలేనికి చెందిన షేక్ నసీమా ఈడబ్ల్యుఎస్ కేటరిగిలో 80వ ర్యాంకు సాధించింది. 720 మార్కులకు 603 మార్కులు సాధించింది. నరసరావు పేటలో పదో తరగతి వరకు , ఇంటర్ గుంటూరులో చదివింది. తల్లిదండ్రులు షేక్ నబిసకినా, మహబూబ్‌సుభాని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లుగా పని చేస్తారు.

గుడికెళ్లే.. వృద్ధురాళ్లే టార్గెట్

- వరుస చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నేరస్థుడి అరెస్టు
- రూ.30లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

7

బియ్యాన్ని బొక్కేశారు

- ఎండీయూల దారి మళ్లింపు బట్టబయలు
- ప్రతీ నెలా గుంటూరులో 5 శాతం పక్కదారి
- బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కనిపించని వ్యత్యాసం

గుంటూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్ వ్యవస్థ ప్రతీ నెలా నాలుగు నుంచి ఐదు శాతం రేషన్ సరుకులను దారి మళ్లించేదన్న విషయం వెలుగులోకి వచ్చింది. ఎండీయూలను తొలగించి రేషన్ డీలర్ల ద్వారా తిరిగి సరుకుల పంపిణీ ప్రారంభించిన దృష్ట్యా ఈ నెల డిస్ట్రి బ్యూషన్ ఆదివారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన పంపిణీ గణాంకాలను పరిశీలిస్తే పల్నాడు, బాపట్ల జిల్లాల్లో గతంలో ఎండీయూలు, ప్రస్తుతం డీలర్ల ద్వారా పంపిణీలో పెద్దగా వ్యత్యాసం కనిపించలేదు. గుంటూరులోనే దాదాపుగా ఐదు శాతం వరకు తక్కువగా కార్డుదారులకు సరుకుల పంపిణీ జరిగింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే ఆ ఐదు శాతం ఎండీయూలు కార్డుదారుల వద్దకే వెళ్లి ఈ-పోస్ యంత్రాల్లో వేలిముద్రలు వేయించి సరుకులు పక్కదారి పట్టించినట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎండీయూల ద్వారా రేషన్ పంపిణీని వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిందో ఆ నెల నుంచి గణనీయంగా పెరిగింది. గతంలో 87 నుంచి 88 శాతం మధ్య ఉండగాఎండీయూ వ్యవస్థ వచ్చిన తర్వాత ఒక్కసారిగా పంపిణీ శాతం 92 దాటిపోయింది. అదేమంటే తాము గడప గడపకు వెళ్లి సరుకులు ఇస్తున్నాం కాబట్టి అందరూ తీసుకొంటున్నారని బుకాయించేవారు. ఏ నెల చూసుకొన్నా గుంటూరులో ఇదే పరిస్థితి. ఇందుకు కారణం కార్డుదారులతో వేలిముద్రలు వేయించి బియ్యం కేజీకి లెక్కకట్టి నగదు చేతిలో పెట్టి ఆ బియ్యాన్ని నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకొనేవాళ్లని అర్థమవుతోంది. ఇప్పుడు రేషన్ డీలర్ల ద్వారా సరుకుల పంపిణీ జరుగుతుండటంతో బియ్యం అవసరం లేని వాళ్లు షాపులకు వెళ్లడం లేదు. ఈ కారణంగానే గుంటూరు జిల్లాలో పంపిణీ శాతం ఎండీయూ వ్యవస్థ అమల్లోకి రాక ముందు ఎంత శాతం ఉండేదో ఇప్పుడు కూడా అదే స్థితికి చేరుకున్నది. ఆదివారం మహా అయితే ఒక శాతం మించి సరుకులు తీసుకునే పరిస్థితి ఉండదు.

గత ఐదు నెలల్లో పంపిణీ శాతం ఇలా...

జిల్లా	కార్డుల సంఖ్య	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్
గుంటూరు	589531	92.50	92.38	92.66	91.42	87.17
పల్నాడు	634893	88.08	86.39	86.21	85.98	85.87
బాపట్ల	476529	86.26	86.23	86.05	86.90	85.32



- పిడుగురాళ్ల ఐసీడీఎస్ కార్యాలయం

అంగన్‌వాడీ.. అస్తవ్యస్తం

- జిల్లాలో కొరవడిన పర్యవేక్షణ
- గాడితప్పుతోన్న కేంద్రాల నిర్వహణ
- ఇన్‌చార్జ్‌ల పాలనలో ఐదు ఐసీడీఎస్‌లు

పిడుగురాళ్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9 ఐసీడీఎస్ ప్రాజెక్టులకు ఐదు ప్రాజెక్టులకు సీడీపీవోలు లేరు. ఒక్కో ప్రాజెక్టులో సీడీపీవోతో పాటు గ్రేడ్-1, గ్రేడ్-2, కాంట్రాక్ట్ సూపర్‌వైజర్లు పనిచేయాల్సి ఉంది. అయితే బదిలీలు, ఉద్యోగోన్నతులు నిర్వహించకపోవడంతో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ గాడితప్పుతోంది. సీడీపీవో పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇన్‌చార్జ్ పాలనలో అంగన్‌వాడీ కేంద్రాలు అస్తవ్యస్తంగా నడుస్తున్నాయి. సీడీపీవో సొంత ప్రాజెక్టును వదిలి ఇన్‌చార్జిగా ఉన్న ప్రాజెక్టుకు వెళ్లేందుకు వీలు పడటంలేదు. దీంతో సూపర్‌వైజర్లు మొక్కుబడిగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేస్తున్నారు. పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో గ్రామ, పట్టణాల్లోని కేంద్రాల పనితీరు కూడా దారుణంగా మారుతోంది.

సీడీపీవోలు, సూపర్‌వైజర్లు నిత్యం వారి పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్ని ఆకస్మికంగా తనిఖీలతో పాటు ఆయా కేంద్రాల పని తీరును పర్యవేక్షిస్తూ లోపాలను గుర్తించి నివేదికలను సమర్పించాలి. అదేవిధంగా కేంద్రాలు సక్రమంగా నడిచేలా చర్యలు చేపట్టాలి. అయితే పర్యవేక్షణకు సంబంధించిన కీలక పోస్టులు నెలల తరబడి భర్తీ చేయడంలేదు. మెమోలు ఇచ్చినా లెక్కచేయని అంగన్‌వాడీ కార్యకర్తలకు అసలు తనిఖీకి వచ్చే అధికారే లేకపోవడంతో కేంద్రాల నిర్వహణపై చిన్నారుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పలు ఆరోపణలు చేస్తున్నారు.

ఎక్కడెక్కడ ఖాళీ అంటే..

పిడుగురాళ్ల, గురజాల, నరసరావుపేట, వినుకొండ, ఈపూరు ప్రాజెక్టులకు సీడీపీవోల పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. నా దెండ్ల సీడీపీవో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ కావాల్సి ఉంది. గ్రేడ్ -1 సూపర్‌వైజర్ పోస్టులు మూడు, గ్రేడ్-2 పోస్టులు పది వరకు ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్ట్ పద్ధతిపై మరో సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉంది.

రాయితీ విత్తనం..మొక్కుబడిగా

- పచ్చిరొట్ట విత్తనానికి రైతుల నుంచి డిమాండ్
- 5.75 లక్షల ఎకరాలకు.. 35,626 ఎకరాలకే పంపిణీ
- నిల్వలు లేవంటున్న వ్యవసాయశాఖ తీరుపై అసంతృప్తి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తున్నాం.. ఎరువులు వాడకం తగ్గించేందుకు పచ్చిరొట్ట సాగు చేయాలి.. 50 శాతం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నాం.. అని వ్యవసాయ శాఖ చెబుతోంది. రైతులు కూడా పచ్చిరొట్ట విత్తనాల సాగుకు పెద్దసంఖ్యలో ముందుకు వస్తున్నారు. అయితే విత్తన పంపిణీ డిమాండ్‌కు తగ్గట్లుగా లేదు. వ్యవసాయశాఖ మొక్కుబడిగానే పంపిణీకి పరిమితమైంది. సాగు లక్ష్యానికి విత్తన పంపిణీకి పొంతన లేదు. పల్నాడు జిల్లాలో 5.75 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అయితే పచ్చిరొట్ట విత్తనం 35,626 ఎకరాలకే సరిపోతుందని ఆ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయంటే ఈ సాగుకు ప్రోత్సాహం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. జనుము, జీలుగ విత్తనాలకు డిమాండ్ అధికంగా ఉన్నా వ్యవసాయశాఖ పట్టీపట్టనట్లుగా ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. వరితో పాటు పత్తి, మిరప పంటలు సాగు చేసే పొల్లాల్లో కూడా పచ్చిరొట్ట సాగుకు రైతుల ఆసక్తి చూపుతున్నా అధికారుల నుంచి సహకారం లేదు. నరసరావుపేట మండలం పమిడిపాడులో 110 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనం అవసరం ఉండగా 12 క్వింటాళ్లను మాత్రమే సరఫరా చేశారు. కొందరికి మాత్రమే ఇచ్చి మిగిలిన వారికి లేదంటే రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుందని ఎవరికీ పంపిణీ చేయకుండా మూడు రోజులుగా నిలిపివేశారు. పమిడిపాడు ఓ ఉదాహరణ మాత్రమే. ఇదే పరిస్థితి జిల్లాలోని అన్ని గ్రామాల్లో నెలకొన్నట్లు రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పచ్చిరొట్ట విత్తనం చల్లేందుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే విత్తనాలు అందుబాటులో లేకుండా పోయాయి. వ్యవసాయ శాఖ ఇండెంట్ తక్కువగా పంపడం వల్లే విత్తన కొరత నెలకొందని మార్కెట్ యార్డు కమిటీలు చెబుతున్నాయి.

వ్యవసాయ శాఖ ఇండెంట్ పెంచి వెంటనే పచ్చిరొట్ట విత్తనాలను తీసుకొచ్చి రైతులకు అందజేయాలని కమిటీలు కోరుతున్నాయి. భూసారం పెంచే పచ్చిరొట్ట సాగుకు రాయితీ విత్తనం పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.



విత్తన కేటాయింపులు క్వింటాళ్లలో ఇలా..

నియోజవర్గం	జీలుగ	జనుము	పిల్లిపెసర
నరసరావుపేట	471.5	229	171.2
చిలకలూరిపేట	44	180	113.04
వినుకొండ	354.1	290.1	131.48
గురజాల	464.9	270.9	177.16
మాచర్ల	411.4	29.4	88
సత్తెనపల్లి	525.3	355.4	184.84
పెదకూరపాడు	305.8	174.2	297.28

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
★ SINCE 1965 ★
గుంటూరు ● ఆదివారం 15 జూన్ 2025

రేవంత్ అన్నా... తగ్గేదేలే

సంధ్య థియేటర్ ఘటన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, అల్లు అర్జున్ ఒకే వేదికను పంచుకోవడం ఇదే తొలిసారి కావడం, వారిద్దరి కలయిక ఎలా ఉండబోతోందో అనే ఆసక్తిని పెంచింది. అల్లు అర్జున్‌ను రేవంత్‌రెడ్డి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 'పుష్ప 2' చిత్రానికి గాను ఉత్తమనటుడు పురస్కారాన్ని రేవంత్‌రెడ్డి నుంచి అందుకున్నారు అల్లు అర్జున్. వ్యాఖ్యాతలు ఆయన్ను వేదికపై మాట్లాడాలని కోరడంతో అల్లు అర్జున్ మైక్ అందుకున్నారు. ముందుగా తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌రెడ్డి అన్న అంటూ ముఖ్యమంత్రిని సంబోధించారు. 'సినిమా ఫంక్షన్ కాబట్టి సరదాగా ఒక డైలాగ్ చెప్పొచ్చా అన్నా' అంటూ రేవంత్‌రెడ్డిని అనుమతి అడగడం, ఆయన నవ్వుతూ అనుమతిస్తున్నట్లు చేతిని ఊపడంతో 'పుష్ప 2'లోని డైలాగ్‌ను అల్లు అర్జున్ చెప్పారు.





పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు
మణిరత్నం



బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు
సుకుమార్



నాగిరెడ్డి - చక్రపాణి అవార్డు
అట్లూరి పూర్ణచంద్రరావు



కాంతారావు ఫిల్మ్ అవార్డు
విజయ్ దేవరకొండ



రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు
యండమూరి వీరేంద్రనాథ్

"60 ఏళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం నంది అవార్డులను ప్రవేశపెట్టింది. 14 ఏళ్ల కిందట ఆగిపోయిన ఈ కార్యక్రమాన్ని మళ్లీ కొనసాగించాలని నేడు నిర్ణయించుకున్నాం. తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డులను ప్రకటించాం. ప్రభుత్వాన్ని నడిపేటప్పుడు కొన్ని నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ... మిమ్మల్ని అభిమానంగా చూసుకుంటుంది."

- రేవంత్ రెడ్డి, సీఎం



ఉత్తమ చిత్రం బాహుబలి 2
రాజమౌళి, ప్రసాద్ దేవినేని

కన్నుల పండుగగా గద్దర్ అవార్డుల వేడుక

'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2024' ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా 2024 ఏడాదికి గాను తెలుగు చలనచిత్రాలకు చెందిన వివిధ కేటగిరీల్లో విజేతలతో పాటు 2014-2023 వరకు ఉత్తమ ప్రథమ, ద్వితీయ, తృతీయ చలనచిత్రాలకు, ఉత్తమ నటీనటులు, దర్శక నిర్మాతలకు సైతం ఈ పురస్కారాలను అందించారు. 14 ఏళ్ల తర్వాత తెలంగాణ ప్రభుత్వం తెలుగు సినిమాకు ప్రాంతీయ అవార్డులు ఇచ్చింది ఈ కార్యక్రమానికి యావత్ చిత్ర పరిశ్రమ కదిలొచ్చింది. తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు, ఎండీ ఎస్. హరీష్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. రెడ్‌కార్పెట్‌పై సినీ ప్రముఖులు సందడి చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే అవార్డ్ ఫంక్షన్‌కు సంబంధించిన సావనీర్‌ను వారిద్దరూ ఆవిష్కరించారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్ మెమెంటోనూ రూపొందించిన రమావత్ నాగుల నాయక్‌ను, జ్యూరీ చైర్మన్ మురళీమోహన్, చైర్‌పర్సన్ జయసుధ, సభ్యులు కే దశరథ్, డీవీకేరాజు, ఊహ తదితరులను జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు ఎస్. తమన్, ఎం.ఎం కీరవాణి, గాయకులు రామ్ మిరియాల, మంగ్లీ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గద్దర్‌ను గుర్తు చేసుకుంటూ మంగ్లీ 'పొడుస్తున్న పొద్దుమీద, బండెనక బండికట్టి' పాటలు ఆలపించారు. పాతతరం కథానాయికలు జయప్రద, జయసుధ, సుహాసిని, ఒకేఫ్రేమ్‌లో కనిపించి అలరించారు. భీమ్స్ సిసిరోలియో తల్లితో పాటు కలసి పురస్కారం అందుకున్నారు. ఆ సందర్భంలో ఆయన తల్లిని ముద్దాడిన దృశ్యం మనసుకు హత్తుకుంది. ముందుగా వ్యక్తిగత అవార్డ్ విభాగం ప్రధానంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. ఈ పురస్కారాలను అందజేశారు. తర్వాత రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తొలిపురస్కారాన్ని 'రజాకార్' చిత్రానికి గాను ఉత్తమ నిర్మాతగా గూడురు నారాయణరెడ్డి, దర్శకుడు యాట సత్యనారాయణకు అందజేశారు. ఉత్తమ ప్రజాధరణ చిత్రం కేటగిరిలో 'ఆయ్' చిత్రానికి గాను బన్నీ వాసు తరఫున అల్లు అరవింద్ పురస్కారం అందుకున్నారు.

శుభ పరిణామం

14 ఏళ్ల తర్వాత ఈ రోజు తెలుగు సినిమా అవార్డ్ వేడుకను నిర్వహించుకోవడం శుభ పరిణామం. 2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించినప్పటి నుంచి జ్యూరీ ఎంపిక చేసిన చిత్రాలకు అవార్డ్ ఇవ్వడం సంతోషకరం. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్ ఈ రోజు ఇంత వైభవంగా నిర్వహించుకోవడానికి కారణమైన తెలంగాణ సీఎం ఎ. రేవంత్‌రెడ్డి గారికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారికి ధన్యవాదాలు.

- దిల్‌రాజు

నా కుటుంబం తరపున ధన్యవాదాలు

ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నందమూరి బాలకృష్ణ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తెలంగాణ ప్రభుత్వం బ్రహ్మాండమైన ఉత్సవాన్ని జరుపుతోంది. గద్దరన్న తెలంగాణ ముద్దు బిడ్డ. ఆయన పేరును చిరస్థాయిగా నిలబెట్టేలా ఈ అవార్డులు ఇవ్వడం గొప్ప విషయం. అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. 1996లో ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఇవ్వడం మొదలైంది. మధ్యలో ఆగిపోయింది. మళ్లీ పదేళ్ల తర్వాత తిరిగి ఎన్టీఆర్ అవార్డ్‌ను ఇస్తున్నందుకు నా కుటుంబం తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఈ అవార్డ్‌కు తొలి గ్రహీతగా ఎంపికవ్వడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఈ పురస్కారంతో పాటు ఇచ్చే నగదు బహుమతిని బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు రేవంత్ అన్న ఇచ్చినట్లు భావిస్తున్నాను' అని చెప్పారు.

నా బాధ్యతను పెంచింది

సినిమా పరిశ్రమను ఒకతాటిపైకి తెచ్చి గద్దరన్న పేరుతో అవార్డులు ఇవ్వడం ఆనందంగా ఉంది. కాంతారావు గారి పేరు మీద ఇచ్చే అవార్డ్‌ను స్వీకరిస్తున్న తొలి నటుడిగా నా బాధ్యతను మరింత పెంచింది. రేవంత్‌రెడ్డి గారికి ధన్యవాదాలు.

విజయ్ దేవరకొండ



2024లో ఉత్తమ చిత్రాలు



మొదటి ఉత్తమ చిత్రం: కల్కి 2898 ఏడీ - దర్శక నిర్మాతలు చలసాని అశ్వనిదత్, నాగ్ అశ్విన్



రెండో ఉత్తమ చిత్రం పొట్టేల్ - నిర్మాత ఎస్ కుమార్



మూడో ఉత్తమ చిత్రం లక్కీ భాస్కర్ - దర్శకనిర్మాత వెంకీ అట్లూరి, నాగవంశీ



బాలనటులు -అరుణ్‌దేవ్, హారిక (35 చిన్న కథ కాదు)



ఉత్తమ చిత్రం ఉప్పెన
నవీన్ యెర్నేని, వై. రవిశంకర్



దర్శకుడు వేణు - బలగం



అడివి శేష్ - మేజర్



రజాకార్ (బెస్ట్ పిక్చర్ ఆన్ హిస్టరీ)
నిర్మాత గూడూరు నారాయణ రెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణ



ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా-2)



దర్శకులు- సుజిత్, సందీప్ ('క')



జ్యూరీ చైర్మన్ మురళీమోహన్



జ్యూరీ చైర్‌పర్సన్ జయసుధ



కీరవాణి, చంద్రబోస్‌కు సత్కారం



దర్శకుడు యదువంశీ (కమిటీ కుర్రోళ్లు)

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి

రేపల్లె, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మరమ్మతులు చేపడుతూ.. గేర్‌లో ఉన్న ట్రాక్టర్‌ను ఒక్కసారిగా స్టార్ట్ చేయడంతో వెనుక చక్రం కింద పడి నల్లూరు రమేష్ బాబు(45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రాజశేఖర్ వివరాల మేరకు.. నల్లూరు గ్రామంలో గ్రామస్తుడు రమేష్‌బాబు ట్రాక్టర్ మరమ్మతులు చేప డుతుండగా.. ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతుని భార్య వాణి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పోస్టు మార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

మంత్రి లోకేశ్‌పై విమర్శలు సహించేది లేదు



● శిల్పారామం చైర్‌పర్సన్ మంజులారెడ్డి

రెంటచింతల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం నిధులు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జేబులోకి వెళ్లాయని వైసీపీ నేతలు కారుకూతలు కూయడం సమంజసం కాదని శిల్పారామం చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. విద్య విలువ తెలిసిన నేత మంత్రి నారా లోకేశ్ అని, విద్యకు ప్రాధాన్యతనిచ్చింది ఎన్డీఏ ప్రభుత్వమని ఆమె పేర్కొన్నారు. కారు కూతలు కూస్తే ప్రజలు మెప్పు పొందుతారనేది ఒట్టి భ్రమ అన్నారు. ప్రస్తుతం ప్రతి తల్లి కంటి వెంట ఆనంద భాష్పాలు రాలుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని కుటుంబంలో ఒకరికే వర్తింపజేస్తే.. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంత మంది ఉన్నా తల్లికి వందనం వర్తింపజేయడం హర్షణీయమన్నారు. ఆర్యవైశ్య నేత కొత్తా ఆంజనేయులు ఉన్నారు.

అరంగేట్రం అద్భుతం

అమెరికాలో కూచిపూడి నేర్చి..
గుంటూరులో డాక్టర్ అపర్ణ నృత్య ప్రవేశం
జీజీహెచ్ వైద్యకళాశాల 'జింకానా'లో తొలి ప్రదర్శన



గుంటూరు మెడికల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ లబ్‌డబ్ అనే హృదయ ధ్వనులే వినిపించే గుంటూరు వైద్య కళాశాల జింకా నా ఆడిటోరియం శనివారం నాట్య మంజీర ధ్వనితో.. మువ్వల సందడి చేసింది. అమెరికాలో నివసిస్తూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, శాస్త్రీయ నృత్యరీతులను పరిరక్షించే దిశగా కృషి చేస్తున్న కూచిపూడి నాట్య కళాకారిణి డాక్టర్ అపర్ణ కంభంపాటి నృత్య రంగప్రవేశం శనివారం జింకానా ఆడిటోరియంలో వైభవంగా జరిగింది. తన తొమ్మిదవ ఏట నుం చే నృత్య శిక్షణ ప్రారంభించిన ఆమె, హోస్టన్ నగరంలోని వేదాంతం కళాక్షేత్రం వ్యవస్థాపకులు వేదాంతం రాఘవ దగ్గర శిష్యరికం చే శారు. కూచిపూడి నృత్యంలో 17 ఏళ్ల పాటు అభ్యాసం చేశారు. ఆమె త న తొలి నృత్య ప్రదర్శన గుంటూరులో ఇవ్వడం విశేషం. పుర ప్రముఖులు, సంగీత, సాహిత్య నిపుణుల సమక్షంలో డాక్టర్ అపర్ణ కూచిపూడి నాట్య ప్రదర్శనతో రంగప్రవేశం చేశారు. నర్తన శైలితో అందరినీ ఆక ట్టుకున్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడిన కంభంపాటి మహదేవ్, వరలక్ష్మి దం పతుల కుమార్తె అపర్ణకు నగరానికి చెందిన ప్ర ముఖ వైద్యులు పీవీ హనుమంతరావు మేనమామ. టెక్సాస్ యూనిర్శిటీ నుంచి బయోకెమిస్ట్రీలో బ్యాచులర్ డిగ్రీ, డల్లాస్‌లోని యూటీ సౌత్ వెస్ట్రన్ మెడికల్ స్కూల్ నుంచి మెడిసిన్ డాక్టరేట్ (ఎండీ) పొందిన అపర్ణ చదువులోనూ ప్రతిభావంతురాలు. సంస్కృత విశ్వ విద్యాలయం ఆచార్యులు కె. విశ్వనాథశర్మ, హరికథా గాయకులు డాక్టర్ ముప్పవ రపు సింహాచల శాస్త్రి తదితరులు అపర్ణను ఆశీర్వదించారు. తొలుత దీపారాధన, ప్రార్థనతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విఘ్నాధిపతి వినాయకుడి కీర్తనతో నృత్యం ప్రారంభించారు. డీఎస్‌పీ శాస్త్రి, కొలమ నూరు రాజగోపాలచారి, రామరాజు దివాకర్, ఉల్లి మురళీ, కొండా శశిధర్, జయకుమారు ఆచార్య గాత్ర, వాద్య సహకారం అందించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విశ్వనాథ శర్మ, సింహాచల శాస్త్రి తదితరులు

విద్యుత్ ప్రైవేటీకరణకు స్మార్ట్ మీటర్లు వారధి

గుంటూరు(తూర్పు), జూన్ 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు వారధి అని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కోశాధికారి ఎస్. రాజేంద్రన్ పేర్కొన్నారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యూఈఈయూ) రాష్ట్ర 11వ మహా సభలు గుంటూరులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమయ్యాయి. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.సూరిబాబు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో రాజేంద్రన్ మాట్లాడుతూ విద్యుత్ రంగంపై కేంద్రం పెత్తనం పెరిగిందని, రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, ప్రైవేటీకరణ విధానాలు అనుసరిస్తోందన్నారు. ప్రైవేటు సంస్థల వద్ద విద్యుత్ కొనుగోలు చేయాలని తెస్తున్న ఒత్తిడి ఫలితంగా.. అధిక ధరకు కొనుగోలు చేసిన రాష్ట్రాలు అప్పులపాలవుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శన్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏవీ నాగేశ్వరరావు, సీహెచ్ నర్సింగరావు, యునైటెడ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి ముజఫర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రన్, పాల్గొన్న సీఐటీయూ నాయకులు


గుడికెళ్లే వృద్ధురాళ్లే టార్గెట్

గుంటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా వెళ్లే వృద్ధ మహిళలే లక్ష్యంగా వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. పొన్నూరు రోడ్డులోని ఆనందపేట ఒకటో లైన్‌కు చెందిన షేక్ అమీర్ బాషా అలియాస్ జౌహరీని అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.30 లక్షలు విలువైన 300 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఎస్పీ సతీష్ కుమార్ వివరాలు వెల్లడించారు. పాత నేరస్థుడు, కార్పెంటర్ అయిన అమీర్ బాషాపై ఒక హత్య, 22 చైన్ స్నాచింగ్స్, చోరీ కేసులున్నాయని వెల్లడించారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన స్నాచింగ్ కేసు ఛేదనలో సీసీఎస్ అదనపు ఎస్పీ కె.సుప్రజ అమీర్ బాషా నిందితుడిగా గుర్తించినట్లు తెలిపారు. నిందితుడు పక్కా పథకం ప్రకారం, రెక్కీ వేసి గురువారం సాయిబాబా ఆలయానికి వెళ్లే వృద్ధ మహిళే టార్గెట్‌గా అది కూడా మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య తాను ఎంచుకున్న ప్రాంతంలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడే వాడని చెప్పారు. గతేడాది సెప్టెంబర్ 22 నుంచి మార్చి 28 వరకు కొత్తపేట, పాత గుంటూరు, లాలాపేట, అరండల్ పేట, పట్టాభిపురం, నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడు చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డాని వివరించారు. 2016లో బాషాపై సస్పెక్టెడ్ షీటు తెరవడంతో.. విరామ మిచ్చి గతేడాది నుంచి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. పదేళ్లుగా చోరీ సొత్తు కొనుగోలు చేస్తున్న వారందరికీ త్వరలోనే నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. నిందితుడు అమీర్ భాషను అరెస్టు చేసిన సీసీఎస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ సతీష్ కుమార్ రివార్డులు ప్రకటించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

ఐఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఎస్ఆర్ఎం ఫస్ట్



మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ

మంగళగిరి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఉన్నత విద్యా సంస్థలు ప్రతిష్టాత్మకంగా భావించే ఇండియన్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఐఐఆర్ఎఫ్)-2025లో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అగ్రస్థానంలో నిలిచింది. న్యూ ఏజ్ ఎమర్జింగ్ యూనివర్సిటీ కేటగిరిలో ప్రథమ స్థానాన్ని సొంతం చేసుకుంది. బోధన, పరిశోధన, పరిశ్రమల ఏకీకరణ, ప్లేస్‌మెంట్స్‌లో ప్రగతి, భవిష్యత్తు దిశానిర్దేశం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఐఐఆర్ఎఫ్ దేశంలోని యూనివర్సిటీలు, పరిశోధన సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలకు ఏటా వివిధ కేటగిరిల్లో ర్యాంకులను ప్రకటిస్తుంది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి జాతీయ సౌత్ జోన్ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకును కేటాయించింది. బెస్ట్ న్యూ ఏజ్ ఎమర్జింగ్ యూనివర్సిటీగా ఏపీ ఎస్ఆర్ఎం జాబితాలో పొందుపర్చింది.

నీట్ ఫలితాల్లో 'శ్రీ చైతన్య' ప్రభంజనం



విద్యార్థులతో డీన్స్ కిశోర్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు విద్య, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు 5 వేల లోపు 41 మంది, పదివేలలోపు 83 మంది ర్యాంకులు సాధించారని ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవింద్ 13, జె. శ్రీకీర్తన 109, ఎం.రోహన్ 133, ఎస్కే నిహాల్ పర్వీజ్ 180, జి.లక్ష్మీదివ్యశ్రీ 187, సీహెచ్ రేవతి రెడ్డి 296, కెశ్రీ వెన్నెల 847, లిడ్యా జాస్మిన్ 976 ర్యాంకులు సాధించారన్నారు. గుంటూరు జోన్ నుంచి 195 మంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధిస్తారన్నారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, డీన్స్ కిశోర్ కుమార్, చంద్రశేఖర్, క్రిష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ఏజీఎం ఎల్‌టీసీ శ్రీనివాస్ అభినందించారు.

సూపర్ సిక్స్ అమలు.. వైసీపీకి చెంపపెట్టు

● మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలి, జూన్14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు చేయడం వైసీపీకి చెంపపెట్టుగా మిగిలిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. శనివారం తెనాలి క్యాంపు కార్యాలయంలో మంత్రి మనోహర్ విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి పట్టంగట్టిన ప్రజల్లో సూపర్ సిక్స్ అమలుతో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఈ పథకాలు అమలు చేయలేరన్న వైసీపీకి ఇప్పుడు వణుకు పుడుతోందన్నారు. పేద మహిళలు కూడా గ్యాస్ పొయ్యితో వంట చేసుకునేలా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం పేరుతో బిడ్డల చదువుకయ్యే ఖర్చును ప్రభుత్వమే బరించేలా పథకాన్ని రూపొందించి పారదర్శకంగా అమలు చేస్తున్నామని, ఇందుకు రాష్ట్రంలో 67.37లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,191 కోట్లు జమ చేశామని చెప్పారు. విద్యాలయాల్లో మంచి చదువుతో పాటు పౌష్టికాహారం అందించేలా సన్న బియ్యంతో ఆహారం అందిస్తున్నామని, మంత్రి లోకేశ్ పిల్లలకు అందించే పుస్తకాలు, బ్యాగులు సైతం నాణ్యతా ప్రమాణాలతో కూడినవని మంత్రి మనోహర్ వివరించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఒక్క బిడ్డకే సాయం అని చెప్పి వాటిని కూడా పారదర్శకంగా అందించక లేకపోయిందని విమర్శించారు. బటన్ నొక్కి డబ్బులు జమవుతున్నాయంటూ ఆనాడు వైసీపీ ఆర్భాటపు సభలు పెట్టడం తప్ప ప్రజలకు చేసిన మంచి లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఎక్కడా కూడా హడావిడి చేయకుండా కూటమి ప్రభుత్వం మంచి వాతావరణంతో సూపర్ సిక్స్ అమలు చేస్తూ నేడు తల్లుల ఖాతాలో నగదు జమచేసి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నామన్న సంతృప్తిని కలిగించిందని మనోహర్ పేర్కొన్నారు.

వైసీపీ విమర్శలు దివాళా కోరుతనానికి నిదర్శనం

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంపై వైసీపీ విమర్శలు వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని.. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మండిపడ్డారు.ఒక్క రోజులో 67.27 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10.091 కోట్లు జమచేయడం దేశ చరిత్రలోనే ఒక రికార్డు అని హ ర్షం వ్యక్తం చేశారు. ఇంత పెద్దఎత్తున, పారదర్శకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకంపై వైసీపీ నేతలు, జగన్ విమర్శలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తల్లికి వందనం అర్హతా ప్రమాణాలు గతంలో వైసీపీ ప్రభుత్వం నిర్దేశించినవే అని, కూటమి ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా పెంచిందన్నారు.

నైపుణ్యవంతులుగా 'కిట్స్' విద్యార్థులు

● కృష్ణా వర్సిటీ వీసీ డాక్టర్ రామ్ జీ కోన



ఇంజనీరింగ్ పట్ట భద్రులకు పట్టాలు పంపిణీ చేస్తున్న వైస్ చాన్సలర్ రామ్ జీ కోన

వట్టిచెరుకూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను నైపుణ్య వంతులుగా తీర్చిదిద్దుతూ.. క్రమశిక్షణకు కిట్స్ కళాశాల అత్యంత ప్రాధాన్యమిస్తోందని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ రామ్‌జీ కోన పేర్కొన్నారు. వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో శనివారం స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ రామ్ జీ కోన, జేఎన్‌టీయూకే నరసరావుపేట ప్రొఫెసర్ డాక్టర్ కె.శోభన్‌బాబు పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు అధ్యక్షత వహించారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు పట్టభద్రులైన విద్యార్థులతో తమ విధులు సక్రమంగా నిర్వహిస్తూ..ఆదర్శ ప్రాయంగా నిలుస్తామని ప్రమాణం చేయించారు. 2021 - 2025 విద్యా సంవత్సరం పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్ పట్ట భద్రులకు రామ్‌జీ కోన, శోభన్ బాబు, చైర్మన్ కోయ సుబ్బారావు, సెక్రటరి కోయ శేఖర్ పట్టాలు ప్రదానం చేశారు.

18న జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలి పర్యటన

గుంటూరు(తూర్పు),జూన్ 14(ఆంధ్రజ్యోతి): జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు డాక్టర్ అర్చన మజుందార్ ఈ నెల 18న జిల్లాలో పర్యటించనున్నారు. ముందు రోజు గుంటూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేస్తారు. అనంతరం డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరిస్తారు. నగరంలోని మహిళా వసతి గృహాలను సందర్శించి, మహిళా లబ్ధిదారులు, జిల్లా యంత్రాంగంతో సమావేశం నిర్వహిస్తారు. 19న విజయవాడ నుంచి తిరుపతికి వెళ్తారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

ప్రకటన

నా క్లయింట్స్ అయినసట్టి లేటు యంపరాల వెంకటేశ్వరరావు గారి కుమారుడు యంపరాల వెంకట్రావు, వీరి కుమారులు అయినటువంటి యంపరాల బుచ్చయ్య చౌదరి మరియు యంపరాల శ్రీకాంత్ గార్ల వలన సంజాయిషి పొంది ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయుచున్నది.

లేటు యంపరాల వెంకటేశ్వరరావు గారు ఈ ప్రకటన షెడ్యూలు దాఖల ఆస్తికి పూర్తి హక్కుదారులు అయి వున్నారు. సదరు ఆస్తిని జీవిత కాలంలో అనగా 07-01-2019వ తారీఖున వారి మనుమలు అయిన యంపరాల బుచ్చయ్య చౌదరి గారు, యంపరాల శ్రీకాంత్ గారి పేరు మీద రెండు సెట్లు డాక్యుమెంట్ దస్తావేజులు వ్రాయించి అమరావతి సబ్ రిజిస్ట్రార్ గారి ఆఫీసులో దస్తావేజులు వ్రాయించి రిజిస్టర్ చేసి యున్నారు. దరిమిలా యంపరాల బుచ్చయ్య చౌదరి గారి పేరుతో 0.65 సెంట్లు మరియు యంపరాల శ్రీకాంత్ గారి పేరుతో 0.65 సెంట్లు ఆర్.ఓ.ఆర్.లో మార్పులు చేసి పట్టాదారు పాసుపుస్తకము ఫారం 1బి మరియు అడంగల్ కాపీలు జారీచేసి యున్నారు. ఆనాటికే కౌలుదారు అయినటువంటి క్రోసూరు నరసింహారావు, తండ్రి : సుబ్బారావు, లేమల్లె గారి స్వాధీనములో ఉండి యున్నది. యంపరాల బుచ్చయ్య చౌదరి గారు మరియు యంపరాల శ్రీకాంత్ గారు కూడా ఎట్టి అభ్యంతరము లేకుండా క్రోసూరు నరసింహరావు గారిని కౌలుదారుగా కొనసాగించు చున్నారు.

ఇట్టి పరిస్థితిలో యంపరాల బుచ్చిబాబు, తండ్రి : లేటు రామారావు గారు, లేమల్లె, అమరావతి తాహసీల్దారు గారి వద్దకు వచ్చి తాను 10-04-2019న OS 481/18 దావాలో రెండవ అదనపు జిల్లా కోర్టు నుండి డిక్రీ పొందినాను అని సదరు డిక్రీ కాపీని వారికి సమర్పించి ఆర్.ఓ.ఆర్ లో తమ పేరును మార్చవలసినదిగా కోరియున్నారు. అంతట తహసీల్దారు గారు నా క్లయింట్‌లో 2వ వారైన యంపరాల బుచ్చయ్య చౌదరి గారికి మరియు 3వ వారైన యంపరాల శ్రీకాంత్ గారికి నోటీసు జారీచేసియున్నారు. అంతట మా క్లయింట్ తహసీల్దారు గారు వద్దకు వెళ్లి వారి అభ్యంతరములు తెలియపరచి యున్నారు. తదుపరి OS 481/18 దావా గురించి విచారించుకొనగా ఆ దావాలో డిక్రీ మోసపూర్వకముగా పొంది నాది అని మా క్లయింట్ అయినటువంటి యంపరాల వెంకట్రావు గారి మరియు వారి తల్లితండ్రులు మరియు సోదరి సంతకములు ఫోర్జరీ చేసి రెండు caveats దాఖలు చేసినట్లును దరిమిలా మా క్లయింట్లు ఎలాంటి నోటీసులు లేకుండా క్లయింట్ తరఫున మరియు తండ్రి, తల్లి, సోదరి తరఫున కె.ఎం.వి. హనుమాన్ మరియు బి. బాజీ మరియు వై.ఎస్.వి.హెచ్. ప్రసాద్ అను ప్లీడర్ల చేత వకాల్తులు దాఖలు చేయించి ఆన్సరు దఖలు చేయకుండా ఎక్సార్టీ డిక్రీ పొందినట్లుగా తెలిసినది. పైన చెప్పిన ముగ్గురు లాయర్లు మరియు యంపరాల బుచ్చి బాబు, తండ్రి : లేటు రామారావు కలిసి సంతకములు ఫోర్జరీ చేసి డిక్రీ పొందినట్లుగా తెలిసినది కనుక యంపరాల బుచ్చిబాబు మీద మరియు ముగ్గురు లాయర్లు మీద నా క్లయింట్ యంపరాల వెంకట్రావు ఆయన సోదరి మరియు కుమారులు సివిల్ మరియు క్రిమినల్ కేసు ను OS 120/21 నాలుగొవ అదనపు జిల్లా కోర్టు లో మరియు గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ నందు FIR నంబర్ 9/2023 ద్వార కేసు వేసి యున్నారు, సదరు కేసులు నిల్వలో వుండి వున్నవి.

ఇట్టి స్థితిలో యంపరాల బుచ్చిబాబు, తండ్రి : లేటు రామారావు గారు, తాహసీల్దారు గారి వద్ద నుండి ఆర్.ఓ.ఆర్ లో తన పేరు మార్పించుకొని ఈ ఆస్తిని అమ్ముటకు లేదా తన బంధువుల పేరున రిజిస్టరు చేయుటకు ప్రయత్నం చేయుచున్నాడు అని తెలిసినది. కనుక ఎవరైనా ఈ నోటీసు షెడ్యూలు దాఖలు ఆస్తి పై ఎటువంటి లావాదేవీలు జరిపినా అవి మా క్లయింట్‌ను బైండు చేయజాలవని అట్లు జరిపినవారు నష్టపోదురు మరియు వారిపై చట్టరీత్య తగు చర్యలు తీసుకొనబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

షెడ్యూలు : ఐటమ్ నెం.1 : గుంటూరు జిల్లా, అమరావతి సబ్ రిజిస్ట్రారు ఆఫీసు, కర్లపూడి శివారు, లేమల్లె గ్రామము, డి.నెం.363/3ఎ. 1.31 సెంట్లు స్థలము హద్దులు : **తూర్పు** : యంపరాల లక్ష్మీనరసమ్మ, **దక్షిణం** : యంపరాల రాజకుమారి, **పడమర** : బందారు నాగేశ్వరరావు, **ఉత్తరం** : 14వ మైలు టూ ఉంగుటూరు రోడ్డు. **ఐటమ్ నెం.2** : గుంటూరు జిల్లా, అమరావతి సబ్ రిజిస్ట్రారు ఆఫీసు, కర్లపూడి శివారు, లేమల్లె గ్రామము, డి.నెం.339/4. 580 చ.గ. స్థలము హద్దులు : **తూర్పు** : ఎలిమెంటరీ స్కూల్, **దక్షిణం** : ముస్లిం సమాధులు, **పడమర** : పంచాయితీ బజారు, **ఉత్తరం** : సిమెంట్ రోడ్డు.

ఇట్లు : **డి. కోటేశ్వరరావు**, అడ్వకేట్ & అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, రాజేంద్రనగర్, గుంటూరు. ఫోన్ : 9440259303

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

నేడు ఎంపీ లావు పర్యటన

మాచర్లటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవ రాయలు ఆదివారం మాచర్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10:30గంటలకు కారంపూడిలోని బ్రహ్మనాయుడు స్కూల్‌లో ఆర్కా, ఉన్నం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెడికల్‌క్యాంపులో పాల్గొంటారు. మధ్యాహ్నం పట్టణంలో టీడీపీ నేత నర్రా గురవారెడ్డి ఇంటికెళ్తారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడులో టీడీపీ నేతలు జెవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శిస్తారు.

మృతుడి కుటుంబానికి అండగా ఆర్యవైశ్యులు

కారంపూడి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇమ్మడి రామకృష్ణ అనారోగ్యంతో మృతి చెందడంతో.. దహన సంస్కారాలకు ఆర్యవైశ్య సంఘ నేతలు శనివారం రూ.13వేలు, కుటుంబ పోషణకు రూ.10వేలు అందజేశారు. రామకృష్ణ ఇద్దరు సంతానానికి రూ.50వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయనున్నారు. రామకృష్ణ కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం అధ్యక్షుడు మద్దు హనుమంతురావు, చీతిరాల వెంకట కోటేశ్వరరావు, ఎస్‌వీఆర్ కృష్ణ, సముద్రాల సాయి, భవిరిశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు లోడు క్రమబద్ధీకరించుకోవాలి

రెంటచింతల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎస్.సింగయ్య తెలిపారు. శనివారం పాలువాయి గ్రామంలో నూతన లైన్ల ఏర్పాటును ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ నియంత్రణ మండలి 50శాతం రాయితీ కల్పిస్తోందని, ఈ నెల 30 లోపు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 21.05 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతోంది.

సాయివిహార్‌లో పుష్కర వార్షికోత్సవం

పిడుగురాళ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని శ్రీసాయివిహార్‌లో శ్రీషిరిడీ సాయిబాబా సహిత ఆంజనేయ, విఘ్నేశ్వర, దత్తాత్రేయ, రాహుకేతు, శివలింగ నవగ్రహ స్వామివార్ల పుష్కర వార్షిక మహోత్సవం శనివారం ప్రారంభమైంది. గుదిమెళ్ల తిరుమల లక్ష్మణాచార్య స్వామి ఆధ్వర్యంలో శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఉన్నత చదువుకు ఆర్థికసాయం

పిడుగురాళ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఏపూరి ఆకాంక్ష ఇంటర్మీడియట్ చదువుకునేందుకు రూ.10వేల చెక్కును చింతలపూడి చారిటబుల్ ట్రస్టు తరపున శనివారం డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ విద్యార్థికి అందించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో ఉన్నత చదువుకు ట్రస్టు వంతుగా సాయమందిస్తామని ఆయన తెలిపారు.

విద్య ద్వారానే మార్పు

పిడుగురాళ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతిఒక్కరికి విద్య ద్వారానే మార్పు మొదలవుతుందని కార్డ్ సంస్థ జాయింట్ డైరెక్టర్ పీ పుష్పలత తెలిపారు. కార్డ్ పల్నాడు శాఖ పిడుగురాళ్ల లెనిన్‌నగర్‌లోని స్కూల్‌లో శనివారం ఏర్పాటుచేసిన బాలబాట ఏసీఓల సమావేశానికి పుష్పలత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పల్నాడులో దళితులు, పేద వర్గాల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్డ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమర్‌నాథ్ తెలిపారు. కార్యక్రమంలో ఎం నాగేశ్వరరావు, పి.ప్రసాద్, కుక్కమూడి ప్రసాద్, వి.రవి, దయామణి, విజయకుమార్, హెచ్‌ఎం లత, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

సత్తెనపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 6వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త చల్లా నాగార్జున(40) శనివారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

సత్తెనపల్లి రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకాలపాడు గ్రామానికి చెందిన రామయ్య రెండు రోజుల క్రితం పురుగుమందు తాగాడు. కుటుంబసభ్యులు ఆయనను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ రామయ్య(44) శుక్రవారం రాత్రి మృతిచెందినట్టు రూరల్ పోలీసులు శనివారం తెలిపారు. భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపంతో రామయ్య పురుగు మందు తాగినట్టు రూరల్ పోలీసులు తెలిపారు.

పూర్ణయ్య కుటుంబసభ్యులకు శివరామ్ పరామర్శ

సత్తెనపల్లి రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫణిదం గ్రామానికి చెందిన గ్రామ టీడీపీ మాజీ అధ్యక్షుడు నిమ్మగడ్డ పూర్ణయ్య ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామ్ శనివారం ఫణిదం వెళ్లి పూర్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. పూర్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు గరికపాటి రమేష్, నలబోతు పాపారావు, కొల్లు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో దాడి..తీవ్ర గాయాలు

బెల్లంకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో దాడి చేయడంతో.. ఒకరికి తీవ్ర గాయాల పాలైన ఘటన మండలంలోని నాగిరెడ్డిపాలెంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఈ ఘటనలో నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కె.శ్రీనివారావుకు తీవ్ర గాయాలయ్యాయి. న్యూచిట్యాల ఆర్ అండ్‌ఆర్ సెంటర్‌కు చెందిన బాలా నాయక్, శ్రీనివాసరావు శనివారం రాత్రి మద్యం సేవిస్తూ గొడవ పెట్టుకున్నారు. బాలా నాయక్ పక్కన ఉన్న బీరు బాటిల్‌ను పగల గొట్టి కడుపులో పొడవటంతో శ్రీనివాసరావు స్పృహ తప్పి పడిపోయాయి. 108 వాహనంలో సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచితంగా కళ్లజోళ్ల పంపిణీ

దాచేపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ, గుంటూరు శంకర్ కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో 510మందికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. శనివారం నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయించుకున్న వారికి కళ్లజోళ్లను అందజేశారు. ప్రతిఒక్కరు కంటి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యదర్శి బుర్రి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న నాగండ్ల సుమతి తదితరులు



మాచర్ల: సీఎం, డిప్యూటి సీఎం, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు



మాచవరంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చిన్నారి, టీడీపీ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ సత్తెనపల్లి నేతలు



క్రోసూరు: చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

'తల్లికి వందనం'తో

కూటమిపై పెరిగిన నమ్మకం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుతో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. శనివారం నగదు జమకావడంతో విద్యార్థులు, తల్లుల ఆనందం వారి ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కుటుంబంలో ఎంతమంది విద్యార్థులున్నా.. అంతమందికి రూ.13వేల చొప్పున జమకావడం వారి విద్యాభివృద్ధికి భరోసా కల్పించినట్లయిందన్నారు. కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి తల్లికి వందనం చెంపపెట్టులాంటిదని పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో వైసీపీ రానున్న ఎన్నికల్లో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు.

● మాచర్లటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. పట్టణంలోని 22వ వార్డులో లబ్ధిదారు లు శనివారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టీడీపీ, బీజేపీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, ఓర్సు క్రాంతి పాల్గొన్నారు.

తల్లుల కళ్లల్లో ఆనందం

సత్తెనపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ నిర్ణయంతో తల్లుల కళ్లలో ఆనందం కన్పిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు అన్నారు. శనివారం టీడీపీ ప్రజావేదికలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వం అమలు చేసిందన్నారు. అర్హులైన వారికి ఒక్కొక్కరికి రూ.13వేలు చొప్పున జమచేశారన్నారు. నాయకులు మస్తాన్‌వలి, నూర్‌బాషా జాన్‌బాబు, రాంబోబుడే, బచ్చు కొండలు, నోముల వెంకటరమణ, తోట అంబిక, మక్కపాటి రవిచంద్రలు పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎలినేడి రామస్వామి తల్లికి వందనం పథకం వల్ల ఎంతోమంది విద్యార్థులకు మేలు జరుగుతుందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు.

● రాజుపాలెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తల్లికి వందనం పథకం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కూటమి నాయకులు తెలిపారు. రాజుపాలెం మండల పరిషత్ కార్యాలయలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం ముందు సీఎం, చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కన్నా చిత్రపటాలకు కూటమి నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కూటమినేతలు జంగం రాజా, పులిబండ్ల సాంబశివరావు, వాసా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

మాచవరం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు చిత్రపటానికి మాచవరంలో శనివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాలాభిషేకం నిర్వహించారు. తల్లికి వందనం నగదు బ్యాంక్ అకౌంట్లలో జమకావటంతో తల్లిదండ్రులు, విద్యార్థులు అందరూ కలసి పాలాభిషేకం నిర్వహించారు. కొన్ని కుటుంబాల్లో నలుగురు పిల్లలకు, ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం నగదు జమ కావటంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు చల్లాపల్లి నరసింహారావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు చిట్టిప్రో లు నరసింహారావు, వుసులూరి రామయ్య, కొల్లి కృష్ణమూర్తి, సయ్యద్ అబ్దుల్లా, కుర్రా కోటయ్య, పూర్ణయ్య, గుడె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం కూటమి నేతల చిత్రపాటాలకు క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా తెలుగు రైతు నాయకుడు కె.వసంతరావు లింగాపురం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● క్రోసూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చదువుకొనే పిల్లందరి తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకం నగదు జమ చేయడం కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకే సాధ్యమైందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య పేర్కొన్నారు. క్రోసూరులోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కాశయ్య మాట్లాడుతూ సంవత్సరంలో ఇచ్చిన హామీలను ఎక్కువ భాగం అమలుచేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు, టీడీపీ నాయకులు అనుమాల పూర్ణ, దుద్దుల యోహాన్, నలజాల కోటేశ్వరరావు, అనుముల వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

● అచ్చంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబడిపూడి గ్రామంలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తల్లికి వందనం నగదు ఖాతాలో జమ కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు పారుపల్లి నరసింహారావు, మాజీ సర్పంచ్ మచ్చా సూరయ్య, బూత్ కన్వీనర్ కొమ్మవరపు దిబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

● గురజాలటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అమలుకావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ముత్యాలమ్మ సెంటర్‌లో చిన్నారులు సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

సర్వీసు రోడ్డు బండ్స్‌కు కోతలు



కోతకు గురైన దృశ్యం

మాచర్లటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షానికే బైపాస్ సర్వీసు రోడ్డుకు ఉన్న బండ్స్ కోతకు గురయ్యాయి. మాచర్ల పట్టణంలో రూ.89కోట్లు వెచ్చించి 8 కి.మీ. మేర ఔటర్ బైపాస్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎస్‌కేబీఆర్ కళాశాల సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన సర్వీసు రోడ్లకు ఏర్పాటుచేసిన మట్టి కట్టలు వర్షపు నీటితో కోతలకు గురయ్యాయి. మట్టి కట్టలకు రాళ్లతో రివిట్‌మెంట్స్ వర్క్స్ నిర్వహించకపోవడంతో కోతలకు గురయ్యాయి. వర్షాకాలం కావడంతో మరింత కోతలకు గురయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో వాహనదారులకు మార్జిన్ దిగితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. కాంట్రాక్టర్ దీనిపై దృష్టిసారించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు.

పెమ్మసానిని కలసిన కన్నా



కేంద్ర మంత్రి పెమ్మసానిని కలసిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ శనివారం గుంటూరులో కలిశారు. వివిధ అంశాలపై వారు చర్చించారు. కన్నా వెంట మండల పార్టీ అధ్యక్షుడు ఆళ్ల అమరేశ్వరరావు ఉన్నారు.

వాగులో పూడిక తీత, పిచ్చిచెట్ల తొలగింపు

సత్తెనపల్లి రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద మక్కెనలోని ఎస్సీ కాలనీ పక్కన ఉన్న వాగులో పూడిక తీత, పిచ్చి చెట్ల తొలగింపు పనులు టీడీపీ గ్రామ నాయకులు శనివారం ప్రారంభించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వాగు పొంగి ప్రవహించటంతో వాగులో నీరు ఎస్సీ కాలనీలోని ఇళ్లల్లోకి చేరుతోంది. ఈ విషయాన్ని కాలనీవాసులు ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి జేసీబీని గ్రామానికి పంపించి వాగు పనులు చేయిస్తున్నారు. పనులను గ్రామ సర్పంచ్ మండదపు అన్నపూర్ణమ్మ, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మండదపు సాంబశివరావు, అలపర్తి రాంబాబు, మన్నవ రవి కిషోర్, అబ్బులు రావు, ఎం జయరాజు తదితరులు పర్యవేక్షించారు.

పీఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోవాలి



విద్యుత్ శాఖ ఈఈ సింగయ్య

మాచర్ల రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఈఈ నూతలపాటి సింగయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి పథకంపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు అందిస్తున్నారన్నారు. ఈనెల 30వ తేదీలోపు 50 శాతం రాయితీపై అదనపు లోడు పెంచుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు.

సీపీఐని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరావు

బెల్లంకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో సీపీఐని బోలపేతం చేయాలని నియోజక వర్గ పార్టీ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ నెల 23న బెల్లంకొండలో సీపీఐ మహా సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాదు పాల్గొంటారని తెలిపారు. జిల్లా సీపీఐ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు వెంకటరావు, రాయపాటి జానయ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

మాచర్లటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కు సెంటర్‌లో గల స్టైల్ యూనియన్ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేయగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించిన ఘటన శనివారం చోటుచేసుకుంది. రెంటచింతల మండలం రెంటాలకు చెందిన గొంటు వెంకటరెడ్డి ఏపీ07డీహెచ్ 7317 హీరో గ్లామర్ వాహనాన్ని ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసి, బుక్స్ కొని తిరిగి వచ్చి చూసేసరికి కనిపించ లేదు. దీంతో పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు.



కుటుంబంతో కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్న ఆంద్రూనాయక్

నలుగురు పిల్లలకు రూ.52 వేలు

దుర్గి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగాపురం తండాకు చెందిన ఆంద్రూనాయక్ వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఈయనకు నలుగురు సంతానం. వీరు దుర్గి జడ్పీ హైస్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారు. వీరు నలుగురికి ఒక్కొక్కరికి రూ.13వేల చొప్పున రూ.52 వేలు తల్లి బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఈ సందర్భంగా ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది.

నలుగురికి.. తల్లికి వందనం

పెదకూరపాడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తమ నలుగురు పిల్లలకు తల్లికి వందనం నగదు బ్యాంక్ ఖాతాలో పడటం తమకు ఎంతో ఆనందంగా ఉందని మండలంలోని 75 తాళ్లూరు గ్రామానికి చెందిన జంగాల గ్రీసమ్మ, ప్రేమ్‌కుమార్ ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లలు సుధ, సాయిపల్లవి, దివ్యశ్రీ, వినయ్‌కల్యాణ్‌లతో కలసి సంతోషం వ్యక్తం చేశారు. మొత్తం రూ.52వేలు ఖాతాలో జమయ్యాయని, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే ప్రవీణ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



జంగాల గ్రీసమ్మ, ప్రేమ్ కుమార్ దంపతులతో నలుగురు పిల్లలు

పశుగ్రాసం కోసం రాష్ట్రాలు దాటి..

● తొలకరి వర్షంతో తిరిగి సొంత రాష్ట్రానికి



ఆవుల మందను తోలుకెళ్తున్న కాపరులు

మాచర్లటౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో తొలకరి వర్షాలు కురిసి అడవి పచ్చబడడంతో వలస వచ్చిన పశుపోషకులు తిరిగి తమ గ్రామాలకు గోవులను తోలుకెళ్తున్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో తెలంగాణ రాష్ట్రం నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని ఏలేశ్వరం, పొగల్, దిండి, మద్దిమడుగు పరిసర గ్రామాల నుంచి పశుగ్రాసం కరువై పల్నాడు జిల్లా మంచికల్లు పరిసర ప్రాంతాలకు పెంపకందారులు ఆవులను తోలుకు వస్తుంటారు. జూన్ ప్రారంభం కాగానే తొలకరి వర్షాలతో తెలంగాణ అటవీ ప్రాంతమంతా పచ్చబడి పశుగ్రాసం అందుబాటులోకి రావడంతో ఆవులను తిరిగి తోలుకెళ్తున్నారు.

మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

మాచర్లటౌన్/కారంపూడి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పిడుగురాళ్లకు చెందిన ఉన్నం హాస్పిటల్, గుంటూరుకు చెందిన ఆర్కా హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం నిర్వహించనున్న ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఈ శిబిరం ప్రారంభోత్సవానికి నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు హాజరవుతారన్నారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడి కుటుంబానికి పరామర్శ

అచ్చంపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తాళ్ళచెరువు గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్ రసూల్ అనారోగ్యంతో మృతి చెందడంతో.. టీడీపీ నాయకులు మృతుడి కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పి.బాపిరాజు, టి.ఆంజనేయులు, బత్తుల శ్రీనివాసరావు, తుమ్మా కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా



పిడుగురాళ్ల: యోగాలో పాల్గొన్న ప్రత్యేక అధికారి ఆంజనేయులు, తహసీల్దార్ మధుబాబు, ఉద్యోగులు

పిడుగురాళ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రప్రదేశ్‌లో భాగంగా శనివారం పలు ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఆంజనేయులు, తహసీల్దార్ మధుబాబు, రెవెన్యూ, ఐసీడీఎస్, సర్వే సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. యోగా ట్రైనర్స్ వడ్డవల్లి సాంబశివరావు, గుదె నరసింహారావు, వడ్లమూడి వెంకయ్యలు యోగా ఆవశ్యకతను వివరించారు. అదేవిధంగా వీరాపురం చెరువుకట్టపై గ్రామస్తులు, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ మహిళలు అధిక సంఖ్యలో యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

● అమరావతి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న అమరావతిలోని ధ్యానబుద్ధ వద్ద నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి మండల అధికారులు శనివారం సంసిద్ధత యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ పార్వతి, ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ షేక్ జైనాబ్ జహ ఆధ్వర్యంలో ధ్యానబుద్ధ సమీపంలోని బుద్ధవనం, సచివాలయాలు, హైస్కూల్ గ్రౌండ్, హెల్త్ సెంటర్స్‌లో యోగా నిర్వహించారు. యోగా ఇన్‌స్ట్రక్టర్‌లు సుజాత, బ్రహ్మయ్య యోగా చేయించారు.

కండ్లకుంటలో..

నకరికల్లు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కండ్లకుంట జడ్పీ హైస్కూల్లో శనివారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో పాటు మహిళలు యోగాలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రావెల లింగయ్య, పెమ్మసాని లక్ష్మీనారాయణ, పమిడి రామయ్య, గంగవరపు విశ్వేశ్వరరావు, ఎండూరి శ్రీనివాసరావు, జంపని రామాంజనేయులు, ముప్పాళ్ళ జగన్నాథం, రావెల నాగయ్య, గంగినేని శ్రీదేవి, ఆవుల సుభాషిణి, సూరాబత్తుల సౌజన్య, జడ దయామణి తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లులో..

నకరికల్లు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని సచివాయాల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జీ కాశయ్య, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సత్తెనపల్లిలో..

సత్తెనపల్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ సచివాలయాల పరిధిలో శనివారం యోగా శిక్షకులు, సచివాలయ సెక్రటరీల ఆధ్వర్యంలో యోగా శిక్షణా తరగతులు జరిగాయి. యోగా వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పలువురు శిక్షకులు ప్రజలకు వివరించారు. ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో మంచిదన్నారు.



అమరావతి: యోగాలో పాల్గొన్న అధికారులు, ఉపాధి కూలీలు

రాజుపాలెంలో..

రాజుపాలెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా మాసోత్సవాలలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలోని సచివాలయాల ఆధ్వర్యంలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల సిబ్బందితో పాటు పలువురు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

క్రోసూరులో..

క్రోసూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో ఒత్తిడుల నుంచి దూరం కావచ్చని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో యోగాంధ్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. యోగసనాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఉపాధి పథకం ఏపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధి పథకం అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ సిరిచందన ఆధ్వర్యంలో యోగాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, వైద్య ఆరోగ్యసిబ్బంది చేత యోగాసనాలు వేయించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, సీహెచ్‌వో సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ శివుడు పాల్గొన్నారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రశాంతత కలుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసనాయక్, ఎంఈవో బాల సుందరరావు పేర్కొన్నారు. మండలంలోని చంద్రాజుపాలెం సచివాలయం వద్ద యోగా శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ వెంకట గిరిరెడ్డి, యోగా టీచర్ కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురికి గాయాలు

యడ్లపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పదహారో నంబరు జాతీయ రహదారిపై యడ్లపాడు పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదు గురు గాయపడ్డారు. బాపట్ల జిల్లా వలపర్ల గ్రామస్థులు మొహమ్మద్, హసీనా దంపతులు వారిద్దరు పిల్లలు నసీరా, నహీరాలతో కలసి ద్విచక్రవాహనంపై శనివారం గుంటూరు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా యడ్లపాడు సమీపంలోని నక్కవాగు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. వాహనం అదుపు తప్పి కిందపడగా కుటుంబసభ్యులు నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా మరో ప్రమాదంలో నాదెండ్ల మండలం గణపవరం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్‌భాషా బైక్‌పై గుంటూరుకు బయలుదేరాడు. యడ్లపాడు ఎన్‌ఎస్‌ఎల్ టెక్స్‌టైల్స్ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో వాహనంతోపాటు బాషా రోడ్డుపై పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మద్యం తాగడంతో పాటు అతి వేగంతో నడపడంతో బైక్ అదుపుతప్పి ప్రమాదం జరిగినట్లు సమాచారం. గాయపడిన భాషాను గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

నాదెండ్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామంలో ఉన్న గణపతి, కన్యకా పరమేశ్వరి సమేత కోదండ రామ స్వామి దేవాలయ ద్వితీయ వార్షిక వేడుకలను శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నిర్వహించిన కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నది.

పల్లా సింహాచలంకు మద్దుల వెంకట కోటయ్య నివాళి



పల్లా సింహచలం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మద్దుల వెంకటకోటయ్య

నూజెండ్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తండ్రి పల్లా సింహాచలం సంస్మరణ కార్యక్ర మంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, కోటప్పకొండ శ్రీఆనందవల్లి యాదవ రాజుల అన్నదాన సత్రం అధ్యక్షులు మద్దుల వెంకట కోటయ్య యాదవ్ శనివారం కలసి ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు.

విప్పర్లపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం మూసివేత



మూసి ఉన్న అంగన్‌వాడీ కేంద్ర భవనం

రొంపిచర్ల, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో శనివారం ఉదయం 10.40 గంటలకు పాఠశాల ముందు ఉన్న అంగన్‌వాడీ కేంద్రం మూసి ఉంది. గ్రామంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఒకేచోట నిర్వహిస్తున్నారు. ఇద్దరు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా ఒక అంగన్‌వాడీ వర్కర్‌ను తొలగించటంతో ఆమె కోర్టుకు వెళ్లింది. మిగిలిన వారు కూడా విధులకు హాజరు కావట్లేదు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు కూతవేటు దూరంలో ఉన్న కేంద్రాలకు సక్రమంగా విధులకు హాజరు కాకపోవటం గమనార్హం.

వైసీపీ మండల అధ్యక్షుడిగా వడ్డేపల్లి నరసింహారావు



నరసింహారావు

యడ్లపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా వడ్డేపల్లి నరసింహారావు నియమితులయ్యారు. నియోజకవర్గంలోని మూడు మండ లాలతోపాటు పట్టణానికి నూతన అధ్యక్షులను పార్టీ ప్రకటించింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. యడ్లపాడు మండల అధ్యక్షుడిగా నరసింహారావును నియమిస్తూ నియామక ఉత్తర్వులను అందజేశారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నరసింహారావును మాజీ మంత్రి విడదల రజిని, పార్టీ నాయకులు అభినందించారు.

ఎనిమిదేళ్లుగా అతీగతీలేని వంతెన

- కూలిపోయినా పట్టించుకోని తీరు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- టెండర్లు పిలిచినా నిర్మాణ దిశగా అడుగులు పడలేదు



అధ్వానంగా రాకపోకల కోసం ఏర్పాటు చేసిన రహదారి



కోతకు గురైన విప్పర్లపల్లిలో వాగుపై ఉన్న బ్రిడ్జి

రొంపిచర్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విప్పర్లపల్లి నుంచి నరసరావుపేట వెళ్లే రహదారిలో వాగుపై బ్రిడ్జి కూలి సుమారు ఎనిమిది సంవత్సరాలైంది. అప్పట్లో కురిసిన వర్షాలకు అక్కడ ఉన్న బ్రిడ్జి కోతకు గురై క్రమేపి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలు మార్లు టెండర్లు పిలిచారు. ఐతే నిర్మాణ దిశగా అడుగులు పడలేదు. కొద్ది నెలల క్రితం ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు కూడా బ్రిడ్జిని పరిశీలించారు. ప్రయాణికుల రాకపోకలకు అనువుగా పక్కన రహదారిని నిర్మించారు. ఈ రహదారి కూడా వర్షాలు అధికంగా కురిసినప్పుడు కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరలా గూనలు ఏర్పాటు చేసి రహదారి నిర్మాణం చేపట్టారు. ఐతే బ్రిడ్జి నిర్మాణ దిశగా ప్రజా ప్రతినిధులు గాని, ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. టెండర్లు పిలవటం, మరలా నిలిచిపోవటం జరుగుతుంది. బ్రిడ్జి నిర్మాణానికి చొరవ చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యోగాంధ్రలో ప్రజలంతా భాగస్వాములు కావాలి



బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు పాఠశాలలో యోగాలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



రావిపాడులో యోగా చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి, పంచాయతీ అధికారులు

శావల్యాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా బాగస్వాములు కావాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పిలుపునిచ్చారు. మెగా మాక్ యోగా ప్రదర్శనల్లో భాగంగా స్థానిక మండలపరిషత్ కార్యాలయం వద్ద అధికారులు, అంగనవాడీ టీచర్లు శనివారం యోగాసనాలు వేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈనెల 21వతేదీన రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న యోగాంధ్ర కార్యక్రమానికి మండలంలోని 11 సచివాయాల నుంచి 15,267 మందితో రిజిస్ట్రేషన్‌లు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా కేటాయించగా సచివాలయ ఉద్యోగులు కృషితో లక్ష్యాన్ని అధిగమించామన్నారు. మండలంలో 112చోట్ల యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించేందుకు స్థలాలు గుర్తించి మ్యాపింగ్ చేశామన్నారు. ఈవోపీఆర్డీ సుగుణ, ఎంఈవో సాంబశివరావు, ఏపీఎం వాసుబాబు, కార్యదర్శి యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా

బొల్లాపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ ఆదేశాల మేరకు మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి 8గంటల వరకు మండలంలోని గుమ్మనంపాడు, మేళ్ళవాగు, గుమ్మనంపాడు, కనమలచెరువు, రావులాపురం తదితర గ్రామాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో యోగా కార్యక్రమాలు జరిగాయి. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పీ సీతారామయ్య ఆధ్వర్యంలో యోగా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

● జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి

నరసరావుపేట రూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి తెలిపారు. నరసరావుపేట మండలంలోని రావిపాడు గ్రామంలో శనివారం యోగా డే సందర్భంగా గ్రామ ప్రజలకు యోగాపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి, మండల స్పెషల్ ఆఫీసర్ ఐ మురళి, పంచాయతీ సెక్రటరీ సుబ్బారావు సచివాలయం సిబ్బంది గ్రామస్థులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాల్లో మాక్ డ్రిల్

నాదెండ్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు యోగాంధ్రా మాక్ డ్రిల్‌ను శనివారం నిర్వహించారు. నాదెండ్ల, గణపవరం బుక్కాపురం తదితర గ్రామాల్లో పాఠశాలల్లో యోగాసనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

కంపోస్టు యార్డును పరిశీలించిన అధికారుల బృందం



కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న అధికారుల బృందం

చిలకలూరిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురపాలక సంఘ పరిధిలోని కంపోస్టు యార్డును శనివారం వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. మున్సిపల్ ఆర్‌డీఎస్ హరికృష్ణ, ప్రజారోగ్యశాఖ ఎస్‌ఈ దాసరి శ్రీనివాసరావు, ఈఈ వెంకటేశ్వర్లు, అధికారులు రవికుమార్, ఎండీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ పీ శ్రీహరిబాబులు పరిశీలించారు. యార్డు నిర్వహణ, వ్యర్థాల శుద్ధి ప్రక్రియ, పారిశుధ్య పనులు తదితర అంశాలను ఈ సందర్భంగా అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. యార్డులో జరుగుతున్న పనుల పురోగతిని, వాటి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంపోస్టు యార్డు నిర్వహణ మెరుగుదలకు అవసరమైన సూచనలు, సలహాలు ఇచ్చారు. పారిశుధ్య పనుల నిర్వహణలో కంపోస్టు యార్డు కీలక పాత్ర పోషిస్తున్నందున, దాని పనితీరును మరింత సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మెగా నేత్ర వైద్యశిబిరంలో 589 మందికి పరీక్షలు



కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తున్న డాక్టర్ కోడెల శివరామకృష్ణ

నరసరావుపేట టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజాగారికోటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆస్పత్రిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 589 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 413 మందిని శస్త్రచికిత్సలకు సిఫార్సు చేశారు. అదేవిధంగా గతంలో ఆపరేషన్ జరిగిన రోగులందరికి కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. వైద్యశిబిరంలో డాక్టర్ సుప్రియ, డాక్టర్ ధ్రువ్ వైద్యసేవలు అందజేశారు. ముందుగా వైద్యశిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ ఎన్‌టీఆర్, డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మీరావలి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ బొడ్డపాటి పేరయ్య, మందాడి రవి, కొక్కిరాల శ్రీనివాసరావు, కొల్లి ఆంజనేయులు, అభిమానులు, కార్యకర్తలు, శంకర కంటి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కిటకిటలాడిన వినియోగదారుల సేవా కేంద్రాలు



డబ్బు డ్రా చేయడానికి వినియోగదారుల సేవా కేంద్రానికి తరలి వచ్చిన లబ్ధిదారులు

చిలకలూరిపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం డబ్బులను వారి వారి బ్యాంకు ఖాతాల నుంచి డ్రా చేయడానికి వచ్చిన లబ్ధిదారులతో శనివారం ఇక్కడి వినియోగదారుల సేవా కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. పట్టణంలో 15వరకు ఇటువంటి కేంద్రాలున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల వారు జారీచేసిన లైసెన్సులతో వీటిని నిర్వహిస్తున్నారు. ఆధార్ వేలి ముద్ర ఆధారంగా ఈ కేంద్రాల నుంచి లబ్ధిదారులు కొంత పరిమితి వరకు డబ్బు డ్రా చేసుకునే సౌకర్యం ఉంది. రెండో శనివారం బ్యాంకులకు సెలవు కావడంతో లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ఈ కేంద్రాలకు డబ్బుల కోసం వచ్చారు. ఉదయం నుంచి విశ్రాంతి లేకుండా రాత్రి పొద్దుపోయేవరకు లబ్ధిదారులకు సేవలనందించామని స్థానిక నరసరావుపేట సెంటర్లో ఉన్న మీసేవా కేంద్రంలోని వినియోగదారుల సేవా కేంద్రం నిర్వాహకుడు గోపి చెప్పారు.

కన్నులపండువగా రంగనాయక స్వామి కల్యాణం



కల్యాణ ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం

యడ్లపాడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు మండలం సొలస గ్రామంలో గల భూదేవి సమేత రంగనాయక స్వామి ఆలయంలో స్వామిశాంతి కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ ప్రతిష్ఠ చేసి 140 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరుచూరి రామకృష్ణమాచార్యుల పర్యవేక్షణలో యాజ్ఞికస్వామి పరుచూరి నితిన్ ఆధ్వర్యంలో రుత్విక్‌లు నారాయణం లక్ష్మాచార్యులు, నందిగం సంపత్‌కుమార్‌లు కళ్యాణవేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు అరవపల్లి గిరీష్, శారద దంపతులు, కొల్లూరు హరికృష వెంకటకోటేశ్వరరావు, కోటి నాగ చంద్రిక దంపతులు కల్యాణ వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త వెంకటస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

డ్వాక్రా సభ్యుల పొదుపు మొత్తాలు మాయం

● రూ.7 లక్షల వరకు గోల్‌మాల్ జరిగినట్లు అనుమానాలు

చిలకలూరిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మం డలం పసుమర్రు గ్రామంలో డ్వాక్రా గ్రూపు సభ్యుల పొదుపు మొత్తాలు గల్లంతయ్యాయి. సభ్యుల నుంచి వసూలు చేసిన ఈ మొత్తాలు సంబంధిత బ్యాంకు ఖాతాలో జమకాలేదు. సుమారు రూ.7 లక్షల వరకు పొదుపు మొత్తాలు గోల్‌మాల్ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించారు. మెప్మా, మున్సిపల్ అధికారులు ఈ విషయంపై చిలకలూరిపేట రూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై పోలీసులు విచారణ ప్రారంభించారు. పసుమర్రులో మొత్తం ఐదు సమాఖ్యల పరిధిలో 170 డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. ఒక సమాఖ్య పరిధిలో అందరూ దివ్యాంగులే ఉన్న డ్వాక్రా గ్రూపు వారితో సహా కొన్ని గ్రూపుల వారు సంబంధిత రిసోర్స్ పర్సన్ చేతిలో మోసపోయినట్లు సమాచారం. కొన్ని డ్వాక్రా గ్రూపుల వారి మొత్తాలు జమ కావడం లేదని బ్యాంకు వారు వెల్లడించే వరకు జరుగుతున్న ఈ అక్రమాలు వెలుగులోకి రాలేదు. ఇటీవల గ్రూపులకు సంబంధించిన అన్ని లావాదేవీలు ఆన్‌లైన్ చేస్తున్న నేపథ్యంలో పొదుపు మొత్తాల మాయంపై స్పష్టత వచ్చింది.

ఆక్రమణల తొలగింపు

● పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు ఊరట

వినుకొండటౌన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఆక్రమణలు తొలగించేందుకు మున్సిపల్ అధికారులు శుక్రవారం రాత్రి శ్రీకారం చుట్టారు. గత వైసీపీ పాలనలో పట్టణంలో అక్రమణలపై అధికారులు దృష్టి సారించక పోవడంతో అక్రమణదారుల తాకిడికి ప్రధాన రోడ్లు కుదించుకు పోవడంతో వినుకొండలో ట్రాఫిక్ పెద్ద సమస్యగా మారింది. దీంతో శివయ్య స్థూపం, నరసరావుపేట, మార్కాపురం రోడ్డులోని మసీద్ సెంటర్లలో కనీసం లారీలు తిరగాలన్నా, తిరగలేని పరిస్థితి నెలకొని ఉంది. దీంతో పల్లె ప్రాంతాల నుంచి వివిధ పనులపై పట్టణానికి వచ్చే బాటసారులు, ద్విచక్రవాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నిశితంగా పరిశీలించి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు ఎట్టకేలకు మున్సిపల్ కమిషనర్ శుభాష్ చంద్రబోస్ సిబ్బంది సాయంతో ఆక్రమణలు తొలగించేందుకు పనులు ప్రారంభించారు. ఇప్పటికే శివయ్య స్థూపం సెంటర్లోని నిరుపయోగంగా ఉన్న షాపులతో పాటు ఆక్రమణలు తొలగించగా, శుక్రవారం అర్ధరాత్రి నరసరావుపేట రోడ్డులోని షాపుల ముందు ఉన్న ఆక్రమణలు ఎక్స్‌లేటర్ సాయంతో తొల గించడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

జడ్పీపాఠశాలకు పూర్వవిద్యార్థి సహకారం

శావల్యాపురం, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, మౌళిక వసతులు కల్పనకు పూర్వవిద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. ఆమె మాట్లాడుతూ శావల్యాపురం జడ్పీ పాఠశాల్లో 2004-2005 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థి జవంగుల నాగరాజు పాఠశాలలో సమావేశవేదిక అభివృద్ధికి రూ.20వేల నగదును శనివారం విరాళంగా సమర్పించినట్లు తెలిపారు. పాఠశాల అభివద్ధికి సహకరించిన నాగరాజుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. నాగరాజును ఆదర్శంగా తీసుకొని పాఠశాలకు దాతలంతా సహకరించాలని కోరారు.

జీఎన్‌ఎం విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

నరసరావుపేట టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జీఎన్‌ఎం పరీక్ష ఫలితాల్లో డిస్టింక్షన్ సాధించిన పీఎన్‌సీ అండ్ కేఆర్ నర్సింగ్ స్కూల్ విద్యార్థులకు డాక్టర్ అన్నపూర్ణ ఒక్కొక్కరికి రూ.2 వేల నగదు ప్రోత్సాహం బహుమతులు ఇస్తామని ప్రకటించారని ప్రిన్సిపాల్ డీ గోపీనాధ్ శనివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ డీఎంఈ ప్రకటించిన జీఎన్‌ఎం పరీక్ష ఫలితాల్లో పీఎన్‌సీ అండ్ కేఆర్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. వారిలో 22 మంది విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారన్నారు. 60 మంది విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రేమ్‌చంద్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసప్రసాద్, ట్రెజరర్, అధ్యాపకులు అభినందించారు.

నగదు చెల్లించలేదని రైతుల ఆందోళన

పోట్లూరు(శావల్యాపురం), జూన్ 14(ఆంధ్రజ్యోతి): నెలరోజుల క్రితం రైతుల వద్ద కొన్న ధాన్యానికి ప్రభుత్వం ఇంతవరకు నగదును చెల్లించకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన పొందూరి వెంకటేశ్వర్లు, గోనుగుంట్ల శ్రీనివాసరావు, మండవ వెంకటేశ్వరరావు, గోనుగుంట్ల వీరబ్రహ్మం, మరికొందరు రైతులు మే15వ తేదీన మార్క్‌ఫెడ్‌కు రూ.1740లకు ధాన్యాన్ని విక్రయించారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ప్రభుత్వం వారం రోజుల్లోపే నగదును జమ చేస్తుందని ఓవైపు అధికారులు చెబుతున్నారని, కానీ ధాన్యాన్ని అమ్మి నెలరోజులవుతున్నా ఇంతవరకు నగదు జమ కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. ఖరీఫ్ ప్రారంభమవుతుండడంతో పంటల పెట్టుబడులు కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం స్పందించిన నగదును వెంటనే జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు

నరసరావుపేట అర్బన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ శ్రీవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అలంకరణ చేశారు. స్వామి వారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల దీర్ఘకాల వ్యాధులు, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడే పేదలకు సీఎం సహాయనిధి వరంలా ఆదుకుంటోందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అన్నారు. నియోజకవర్గం పరిధిలోని 32 మందికి రూ.28 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన తన నివాస గృహంలో జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. అత్యవసర వైద్యసేవల నిమిత్తం ఒకరికి రూ.1.75 లక్షల విలువైన ఎల్‌వోసీని కూడా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం సహాయనిధి సాయాన్ని నిలిపివేసిన జగన్, అనారోగ్య సమస్యలతో బాధపడే లక్షలాది పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యసేవలు అందకుండా, వారి ఉసురుపోసుకున్నాడని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం సహాయ నిధిని పునరుద్ధరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ నాయకులు జవ్వాజి మదన్‌మోహన్, కామినేని సాయిబాబు, మద్దుమాల రవి పాల్గొన్నారు.

'తల్లికి వందనం'తో అమ్మకు ఆనందం



ఐదుగురి కుమార్తెలతో తల్లి శీలం అంజమ్మ

నరసరావుపేట టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలం గోనెపూడికి చెందిన శీలం అంజమ్మ, శ్రీనివాసరావు దంపతులకు ఐదుగురు సంతానం. వీరు వరుసగా శివపార్వతి, పావని, శ్రావణి, గాయత్రి, లిఖిత. అయితే తల్లికి వందనం కింద ప్రభుత్వం విడుదల చేసిన నిధుల్లో వీరికి తలా రూ.13 వేలు వంతున నగదు శుక్రవారం జమయింది. దీంతో ఆ కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా తండ్రి శీలం శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం ఒక్కరికి మాత్రమే అమ్మవడి వర్తింపజేసిందన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తల్లికి వందనంలో పిల్లలందరికీ వర్తింపజేయడం ఆనందంగా ఉందన్నారు. కౌలుకు పొలం సాగు చేస్తూ, ఆదాయం కోసం కూలికి వెళ్లే పేద కుటుంబం అని చెప్పారు. ఇది పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తల్లి శీలం అంజమ్మ మాట్లాడుతూ మా అమ్మాయిలకు ఐదుగురికి డబ్బులు పడ్డాయని తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక్కరికి మాత్రమే పడ్డాయన్నారు. చాల సంతోషంగా ఉందని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పాలాభిషేకం



నారా లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ యువనాయకులు

వినుకొండ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయం ఆవరణలో టీఎన్‌ఎస్‌ఎఫ్, తెలుగుయువత ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు శనివారం రాష్ట్ర విద్యాశాల మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌ఎస్‌ఎఫ్, తెలుగుయువత నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో రూ.10,091 కోట్లు జమచేసి చరిత్ర దేశంలో ఎక్కడైన ఉందా అని హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు కూటమిపై తప్పుడు ప్రచారం చేయడం తగదని తెలిపారు. కార్యక్రమంలో తెలుగువిద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో టీడీపీ నేతల పాలాభిషేకం

చిలకలూరిపేట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకాన్ని సమర్థవంతంగా అమలు పరచిన కూటమి ప్రభుత్వానికి మద్దతుగా పట్టణంలోని 9 వ వార్డు పరిధిలోని నెహ్రూనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూటమి నేతలు ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నేతలు పాలాభిషేకం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ కరీముల్లా, పట్టణ అధ్యక్షుడు పఠాన్ సమద్‌ఖాన్, అధికార ప్రతినిధి మురకొండ మల్లిబాబు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నేతలు గోపిదేశి వెంకట్, కార్యదర్శి మామిళ్ళ దాసు, జొన్నలగడ్డ ఫ్రాన్సిస్, బడేమియా, శిఖా నాగరాజు, హనీఫా, ఒంటిపులి వెంకట్ పాల్గొన్నారు.

'తల్లికి వందనం' కృతజ్ఞతలు



రవ్వవరంలో కూటమికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న నాయకులు

నూజెండ్ల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేసి వారి ఖాతాల్లో నగదును జమ చేయటం అభినందనీయమని టీడీపీ నాయకులు బచ్చు అంజిరెడ్డి, మరిడి సురేష్‌లు అన్నారు. అదేవిధంగా నూజెండ్లలో టీడీపీ నాయకులు లగడపాటి సూరిబాబు, గంగినేని బ్రహ్మయ్య, బేతపూడి చిరంజీవి, జనసేన నాయకుడు టీ రజాబాబు తదితరులు తల్లికి వందనం లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నీట్ ఫలితాల్లో నరసరావుపేట విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : నీట్ పరీక్షా ఫలితాలలో శనివారం నరసరావుపేట విద్యార్థులు ప్రతిభ చాటారు. నరసరావుపేట పట్టణానికి చెందిన షేక్ నీహాల్ పర్విజ్ నీట్ ఆల్ ఇండియా 654 ర్యాంకు సాధించింది. నీహాల్ పర్విజ్ తల్లిదండ్రులు షేక్ మలిన్, షేక్ మహమ్మద్ బాషా తన కుమారుడు ఉత్తమ ర్యాంకు సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. బంధువులు, స్నేహితులు అభినందించారు. పట్టణానికి చెందిన అంకిరెడ్డి కాళి వెంకట దమేష్‌రెడ్డి 22062 ర్యాంక్ సాధించాడు. దమేషరెడ్డిని బంధువులు, మిత్రులు అభినందించారు. పట్టణానికి చెందిన నడిమిపల్లి హృతిక 34532 ర్యాంకు సాధించింది. నడింపల్లి హృతిక తల్లిదండ్రులు నడింపల్లి సుబ్బారావు, మల్లేపెద్ది నాగ ధనలక్ష్మి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. హృతికను ఉపాధ్యాయులు, బంధువులు అభినందించారు.